సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

6న రాములోరి కల్యాణం



కరపత్రం ఆవిష్కరిస్తున్న అరుంధతి సేవా సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలోని వినాయక, సరస్వతీదేవి సహిత సీతారామలక్ష్మణ ఆంజనేయ ఆలయంలో ఏప్రిల్ 6న శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామానికి చెందిన అరుంధతి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. 3న పెండ్లి రాట మహోత్సవం, 6న కల్యాణ మహోత్సవం అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

1 నుంచి ఉక్కు ఆస్పత్రి వైద్య సేవల్లో మార్పులు

ఉక్కునగరం: వచ్చే నెల 1 నుంచి ఉక్కు జనరల్ ఆస్పత్రికి అనుబంధంగా అందిస్తున్న సేవల్లో కొన్ని మార్పులు చేశారు. సిబ్బంది కొరత కారణంగా ఆదివారం, సెలవుల్లో మినహా ఓహెచ్‌ఆర్‌సీ, ఈఎంసీయూ–1 జనరల్ షిఫ్ట్‌లో మాత్రమే నడుస్తాయి. కేవలం ఈఎంసీయూ–2 మాత్రమే నిరంతరం సేవలు అందించనుంది. ఆదివారం, సెలవు దినాల్లో వైద్య సేవలు అవసరం అయిన వారు ఈఎంసీయూ–2ను వినియోగించాలని ఉక్కు ఆస్పత్రి అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదే విధంగా పెదగంట్యాడ హెల్త్ సెంటర్‌లో ఏప్రిల్ 1 నుంచి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, సాయంత్రం 3.30 నుంచి రాత్రి 7 వరకు సేవలు అందుతాయి. మిగతా వేళల్లో అవసరమైన వారు ఉక్కు జనరల్ ఆస్పత్రి క్యాజువాల్టీని సంప్రదించాలని పేర్కొన్నారు.

సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న సౌత్ ఏసీపీ త్రినాథరావు

అక్కిరెడ్డిపాలెం: సమాజ ప్రగతిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని సౌత్ ఏసీపీ టి.త్రినాథరావు అన్నారు. ఆటోనగర్‌లో శనివారం స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గాజువాక యూనిట్‌లో ఆధ్వర్యంలో శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బంగారు అశోక్ కుమార్,గౌరవ సలహాదారు కర్రి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణకు డిమాండ్



విచారణకు డిమాండ్ చేస్తున్న క్రైస్తవుల ఐక్యవేదిక నాయకులు

గాజువాక: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని గాజువాక పారిశ్రామిక ప్రాంత క్రైస్తవుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పాతగాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐక్య వేదిక ప్రతినిధులు రెవరెండ్ అద్దేపల్లి రవిబాబు, బిషప్ ఎల్.శామ్యూల్, పుచ్చ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి ప్రమాదంగా అనిపించడంలేదని, దీనిపై తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. పాస్టర్ ప్రవీణ్ పగడాలను ప్రణాళిక ప్రకారం హత్య చేశారని క్రైస్తవ సమాజం అనుమానం వ్యక్తం చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎల్.ఆర్.బిల్లీగ్రహం, ప్రభాకర్, ధనరాజు, డేవిడ్‌రాజు, సుభాకర్, అశోక్‌బాబు, విజయదాస్, ఆనంద్ కుమార్, ఎస్.బి.సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ రాజీనామా

ఉక్కునగరం: క్రమశిక్షణ కలిగిన కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీలో కార్మిక నాయకుడిగా పని చేస్తున్న తనపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కారు రమణ అన్నారు. శనివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తన నిజాయితీని నిరూపించుకునేంత వరకు తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. రాజీనామా లేఖను నాయకులకు అందజేశారు.

ఉగాది సందడి





వేడుకలకు మండలంలోని ఆలయాల ముస్తాబు

పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు



మామిడికాయలు



వేప పువ్వు



ఉగాది పచ్చడి

పెదగంట్యాడ: తెలుగు నూతన సంవత్సరాది.. ఉగాది వేడుకలకు మండలంలోని ఆలయాలు సిద్ధమయ్యాయి. ఆయా ఆలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలచెరువు ఉమారామలింగేశ్వర ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు వాసుదేవ శర్మ తెలిపారు. అలాగే దయాల్‌నగర్ భక్తాంజనేయ ఆలయం, నడుపూరు సంకటమోచన గణపతి ఆలయం, సమతానగర్ షిర్డీసాయి శాంతిధామంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే మండలంలోని పలు నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

తెలుగు వారికి ప్రథమ పండగ ఉగాది..

తెలుగు రాష్ట్రాల ప్రజలకు కొత్త సంవత్సరాది ఉగాది పండగే. రుతువులను అనుసరించి ఈ ఏడాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. ఇది తెలుగు వారి మొదటి పండగ.. ఈ రోజున పంచాంగ శ్రవణం వల్ల మహా ఫలితం కలుగుతుందని పండితులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్ట, సుఖాలకు తార్కాణంగా తీపి, చేదుల కలబోత అయిన ఉగాది పచ్చడిని స్వీకరించడం సంప్రదాయంగా వచ్చింది. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో అందరి జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని పండితుడు వాసుదేవ శర్మ చెబుతున్నారు.

పంచాంగ శ్రవణం

ఉగాది నాడు పంచాంగ శ్రవణం నిర్వహించడం ఓ ప్రత్యేకత.. తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పలు సంస్థలు, దేవస్థానాలు, ప్రముఖులు, పండితులతో పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. కార్యక్రమంలో జన్మ నక్షత్రం లేదా నామ నక్షత్రం ఆధారంగా వ్యక్తిగత జీవిత అంశాలు, వారి ఆదాయ, వ్యయాలతో పాటు పలు అంశాలను విశ్లేషిస్తూ పంచాంగ శ్రవణం చేస్తారు. దాదాపు ప్రతి ఒక్కరూ తమ జాతక ఫలితాలు తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు.



ఉగాదికి సిద్ధమైన ఉమాలింగేశ్వర స్వామి ఆలయం

ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యం



ఉగాది పచ్చడి రుచుల్లో ఒక్కోదానికి ఒక్కో అర్థం ఉంది. ఉప్పు మన జీవితంలో ఆనందం, రుచికి సంకేతంగా పరిగణిస్తారు. పులుపు– తెలివిగా వ్యవహరించాల్సిన పరిస్థితులను తెలియజేస్తుంది. చేదు బాధను దిగమింగాలని లేదా భరించాలని సూచిస్తుంది, తీపి సంతోషానికి ప్రతీక, కారం, సహనం కోల్పోవడాన్ని సూచిస్తుంది. వగరు ఈ రుచి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం గురించి తెలియజేస్తుంది.

– వాసుదేవ శర్మ, అర్చకుడు, ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, బాలచెరువు.

ఘనంగా ఉగాది సంబరాలు



ఉగాది వేడుకలను ప్రారంభిస్తున్న అధ్యాపకులు

గాజువాక: స్థానిక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో విశ్వావసునామ ఉగాది సంవత్సర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏయూ తెలుగు విభాగం ఆచార్యులు అయ్యగారి సీతారత్నం ప్రారంభించారు. ఉగాది ప్రాధాన్యం, ఉగాది పచ్చడి ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.కృష్ణ లు పాల్గొన్నారు.

ప్రసాద వితరణకు విరాళాలఅందజేత



విరాళం అందజేస్తున్న దాతలు వెంకటేశ్వర్లు, సువర్ణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్బీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం నిర్వహించే అల్పాహారం, అన్న ప్రసాద వితరణకు దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. అక్కిరెడ్డిపాలెంకు చెందిన వెంకటేశ్వర్లు, సువర్ణ, డి.సతీష్, శ్వేతలు రూ.35 వేల విరాళం దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. అలాగే కుంచమాంబ కాలనీకి చెందిన విజయ దుర్గ, చైతన్య రితిక, శ్రీ హర్షితలు రూ.5 వేలు, తుంగ్లాం గ్రామానికి చెందిన విక్రాంత్, శ్రీలక్ష్మి రూ.5001 , షీలానగర్‌కు చెందిన శివనాగేంద్ర రెడ్డి, ప్రియాంక రూ.5 వేల విరాళాన్ని దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.

నూకాలమ్మా.. నమోస్తుతే

- వైభవంగా నూకాలమ్మ జాతర
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్త అమావాస్య సందర్భంగా ఊరువాడా సందడి నెలకొంది. ఎక్కడ చూసినా భక్తుల కోలాహలం కనిపించింది. పలు ప్రాంతాల్లో కొలువుదీరిన నూకాలమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో వెంపళ్లనగర్ నూకాంబిక

పెదగంట్యాడ: పెద నడుపూరులో నూకాలమ్మవారికి శనివారం విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. గాజువాక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త తిప్పల దేవన్‌రెడ్డి, 76వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మంత్రి శంకరనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌భాస్కర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు బొడ్డు కృష్ణారావు, బెల్లాల నాగేశ్వరరావు, బెల్లాల పెంటబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో నాయకులు పితాని పాత్రుడు, కట్టా సత్యానందం, పల్లం గోపి, సతీష్ పాల్గొన్నారు.

- వెంపళ్లనగర్ నూకాంబిక ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గల్లా శంకరసాయిరాం ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు దర్శించుకున్నారు.
- జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో వేంచేసియున్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.



పెదనడుపూరులో అమ్మవారికి పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పాహిమాం

కూర్మన్నపాలెం: కొత్త అమావాస్యను పురస్కరించుకొని వడ్లపూడిలో వెలసిన నూకాంబిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 87వ వార్డు అప్పికొండ కాలనీలోని నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బొడ్డగోవింద్, ప్రగడ శ్రీనివాస్, సోమేష్, అజయ్ పాల్గొన్నారు.

- కణితి కాలనీలో నూకాంబిక అమ్మవారికి గ్రామ పెద్దలు ప్రగడ వేణుబాబు,దామోదర్,బి. దానప్పలు,సత్యనారాయణ తదితరులు పూజలు చేశారు.
- అప్పికొండ లక్ష్మీపురం కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కోమటి శ్రీనివాసరావు దంపతులు నూకాంబికు ప్రత్యేక పూజలు చేశారు.

చిన అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెంలోని ఆలయానికి భక్తులు వేకువజామునే చేరుకుని అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. అమ్మవారిని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, నగర ప్రధానకార్యదర్శి సంగ్రాన నూకరాజు, మైనార్టీ నాయకుడు సయ్యద్ హుస్సేన్, శ్రీనివాసరెడ్డి, ఆలయ ధర్మకర్త కాదా రాజు, గ్రామ నాయకులు వెంకటేశ్వరరా

చల్లగ చూడమ్మా

అగనంపూడి: కొత్తఅమావాస్యను పురస్కరించుకుని జీవీఎంసీ79, 85 వార్డుల్లోని అగనంపూడి, నిర్వాసితకాలనీలు కొండయ్యవలస, పెదమడక, పినమడక ప్రాంతాలతోపాటు లంకెలపాలెం, ఫార్మాసిటీకాలనీలు, 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1 కాలనీల్లోని నూకాలమ్మ ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు చేశారు. తర్వాత వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



దయాల్‌నగర్‌లో స్వర్ణ నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు



అప్పికొండలో నూకాంబికకు ప్రత్యేక పూజలు చేస్తున్న దేవన్‌రెడ్డి



కొండయ్యవలసలో పూజలు చేస్తున్న భక్తులు

ఈకేవైసీ గడువు పొడిగించాలని వినతి

గాజువాక: రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవడానికి గడువు పొడిగించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం పౌరసరఫరాల శాఖ సర్కిల్–3 ఏఎస్‌వోకు వినతి పత్రం సమర్పించారు. నాయకులు కె.అచ్యుతరావు, జి.ఆనంద్, పి.దుర్గారావు, కె.వనజాక్షి తదితరులున్నారు.

2న మున్సిపల్ కార్మికుల మహా ప్రదర్శన



మాట్లాడుతున్న జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ నాయకులు

అగనంపూడి: ఆప్కాస్‌ను రద్దు చేసే పక్షంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఉరుకూటి రాజు, రాము డిమాండ్ చేశారు. మరణించిన కార్మికులు, 60 ఏళ్లు దాటిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 2వ తేదీన చేపట్టనున్న మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం 79, 85 వార్డుల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. రెండో తేదీ ఉదయం 10.30 గంటలకు రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ పార్క్ వరకు నిర్వహించనున్న మహా ప్రదర్శనలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సూరిబాబు, సత్యనారాయణ, మీనాక్షి, దేవి, సత్యవతి, బాలరాజు, శ్రీను, నూకరాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



ఎన్నికైన విశాఖ డెయిరీ నూతన అధికారుల సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీ (సీఐటీయూ అనుబంధ) నూతన అధికారుల సంఘాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం నిర్వహించిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా రాజేంద్ర ప్రసాద్, అధ్యక్షుడిగా డెయిరీ (ఏజీఎం, ఈ అండ్ ఎం) పతివాడ గౌరీ శంకరరావు, ఉపాధ్యక్షుడిగా గాడి భూలోక నాయుడు, కార్యదర్శిగా గుంట్రెడ్డి సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా శనివాడ రమణ, కోశాధికారిగా పోతుల శ్రీనివాస్, మెంబర్లుగా సరవ ముత్యాల నాయుడు, పుల్లేటి హరిబాబు, కర్రి వెంకట అప్పారావు, జి.ఎస్.వి.ఎస్.ఆర్.మూర్తి, వేపాడ మాణిక్యం ఎన్నికయ్యారు. విశాఖ డెయిరీ సీటూ కార్యాలయంలో ప్రధానకార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను సీటూ ఆధ్వర్యంలో పరిష్కరించుకున్నామన్నారు. 20 డిమాండ్లలో 19 డిమాండ్లను అమలు చేయడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో పలువురు సీటూ నాయకులు పాల్గొన్నారు.

అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు...



వసంతల యతీష్ కుమార్(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: ఒక్కగానొక్క కొడుకు అందివచ్చాడని ఆనందంతో ఆ తల్లిదండ్రులు ఉన్నారు. ఇంతలో ఏం జరిగిందో ఏమో కానీ ఆ కొడుకు ఉరివేసుకున్నాడని తెలియడంతో ఆ కుటుంబం తల్లడిల్లి పోయింది. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు మండలం శివరాంపురానికి చెందిన వసంతల యతీష్ కుమార్ (25) పరవాడలోని వసుధా ఫార్మా కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు రాజశేఖర్‌తో కలిసి గాజువాకలోని చైతన్యనగర్‌లో సీఎంఆర్ సెంట్రల్ వెనుక ప్రాంతంలో అద్దెకు ఉంటున్నారు. శుక్రవారం ఐపీఎల్ మ్యాచ్‌ను ఇరువురూ కలిసి మద్యం సేవిస్తూ చూశారు. రాత్రి కొంత సమయం తర్వాత రాజశేఖర్ పడుకున్నాడు. అర్ధరాత్రి రాజశేఖర్‌కు మెలకువ వచ్చింది. అప్పటికే యతీష్ ఫ్యానుకు దుప్పటితో ఉరివేసుకుని వేలాడుతూ ఉన్నాడు. వెంటనే రాజశేఖర్ 112కు డయల్ చేసి ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి సీఐ పార్థసారథి సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.